జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
శుక్రవారం 26 12 2025
సంపుటి 1 సంచిక 35
పేజీలు : 04
RNI : TGTEL/25/A4195

విలేకరులు కావలెను
నిత్య నూతన ఒరవడితో వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న జ్వాల దశ పత్రికలో భాగమయ్యేందుకు రంగారెడ్డి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ క్రైమ్ రిపోర్టర్లు
7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)



## డ్రంకన్ డ్రైవ్ లో పాల్గొన్న సీపీ

దశ, హైదరాబాద్: బంజారాహిల్స్‌లోని టీజీ స్టడీ సర్కిల్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను బుధవారం అర్ధరాత్రి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.

4



## యేసు ప్రవచనాలతో ప్రపంచ శాంతి: మంత్రి ఉత్తమ్

యేసు క్రీస్తు ప్రవచనాలతో ప్రపంచ శాంతి వర్ధిల్లుతుందని, ఆయన గొప్ప సంఘ సంస్కర్త అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

3



## ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక మలుపు.

కీ రోల్ కానున్న పెన్ డ్రైవ్.
బీఆర్ఎస్ అగ్రనాయకత్వానికి కంటి మీద కునుకు లేకుండా .
ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు పెన్‌డ్రైవ్‌లో ట్యాపింగ్‌కు సంబంధించిన పక్కా ఆధారాలు.

4

## యాదాద్రి నృసింహుని దర్శనం కోసం
# పోటెత్తిన భక్తులు..

### వరుస సెలవులతో భక్తులతో కిటకిటలాడిన యాదాద్రి దేవస్థానం..

**దశ,యాదగిరిగుట్ట:**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం కోసం పోటెత్తిన భక్తులు. కొండ కింది పార్కింగ్ లో రద్దీగా మారిన వాహనాలు. తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. గురువారం వరుసగా రెండు రోజులు సెలవు దినం కావడంతో హైదరాబాద్ పట్టణం నుంచి ప్రజలు అధిక సంఖ్యలో యాదగిరిగుట్టకు పైనమయ్యారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, వ్రతాలు చేసి ముక్కలు చెల్లించుకున్నారు. స్వామివారి దేవాలయంలో ధనుర్మాస పూజలు ఆరవ రోజుకు చేరుకున్నాయి.. తిరుప్పావై ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు.. కింద పార్కింగ్ స్థలం



నుండి కొండమీది వరకు వాహనాలతో రద్దీగా మారింది. భక్తులకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ



అధికారులు అన్ని సదుపాయాలు కల్పించాలని ఆలయ ఈవో వెంకట్రావు తెలిపారు.




## నల్లగొండ బీజేపీలో
# భగ్గుమన్న విభేదాలు..

- సర్పంచ్‌లకు సన్మానంపై ఘర్షణ
- వాజ్ పేయి జయంతి వేడుకల్లో బీసీ నాయకుడు పిల్లి రామరాజు యాదవ్ పై భౌతిక దాడి
- పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి దౌర్జన్యం నశించాలంటూ పార్టీ కార్యాలయం ఎదుట రామరాజు యాదవ్ ఆందోళన

**దశ నల్లగొండ**

నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయం గురువారం రణరంగంగా మారింది. కొత్తగా గెలిచిన సర్పంచులు, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమం వేదికగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, సీనియర్ నాయకుడు పిల్లి రామరాజు వర్గాల మధ్య తలెత్తిన విభేదాలు

మిగతా 4 లో

## యేసుక్రీస్తు బోధనలు ప్రేమ,శాంతి, సేవా భావాన్ని మనకు గుర్తుచేస్తాయి.

### కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి..

**దశ నల్లగొండ:**

క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్లోనీ పురాతన సేయింటినరీ బాప్టిస్ట్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. కేక్ కట్ చేసి క్రిస్మస్ సంబరాల్లో పాల్గొన్న మంత్రి,ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బురి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, మాజీ డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్



రెడ్డి, కనగల్ మాజీ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, విలియమ్స్, క్రిస్టోఫర్, పసల శౌరయ్య, ప్రవీణ్, ఆనంద్ ప్రసాద్, పలువురు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## రేవంత్ స్కెచ్‌లో
# కేసీఆర్..



- అసెంబ్లీకి వస్తారా..?
- ఈ నెల 29 నుంచి అసెంబ్లీ స్టార్ట్.
- నీళ్లా..నిధులా.. నియమకాలా, సంక్షేమ పథకాలా..ఆప్షన్ మీదే..
- ముఖాముఖి తేల్చుకుందాం రమ్మంటూ రేవంత్ సవాల్.
- కృష్ణా జలాల ఎపిసోడ్‌కు అక్కడే ఫుల్ స్టాప్ పెట్టాలని రేవంత్ స్కెచ్.

*“ కృష్ణా జలాల విషయంలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన ఆరోపణలపై క్విక్‌గా రియాక్ట్ అయ్యారు సీఎ రేవంత్ రెడ్డి. వెంటనే చిట్ చాట్ పేరుతో అన్ని అంశాలపై మాట్లాడిన సీఎం రేవంత్..ఏకంగా కొడంగల్ వేదికగా గులాబీ బాస్‌కు బిగ్ సవాల్ చేశారు. ఈ నెల 29 నుంచి అసెంబ్లీ స్టార్ట్ అవుతుంది. నీళ్లా..నిధులా..నియమకాలా, సంక్షేమ పథకాలా..ఆప్షన్ మీదే..ఏ అంశామైనా చర్చించేందుకు రెడీ అంటూ ఓపెన్ స్టేట్‌మెంట్ ఇచ్చారు.*

**దశ, హైదరాబాద్:**

ముఖాముఖి తేల్చుకుందాం రమ్మంటూ సవాల్ చేస్తున్నారు. అయితే అన్ని అంశాల కంటే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని రేవంత్ ప్రధాన అస్త్రంగా వాడుకునే అవకాశం ఉందట. అసెంబ్లీ వేదికగా ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని చర్చకు పెట్టి..బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా కార్నర్ చేయాలనేది రేవంత్ వ్యూహమంటున్నారు. సేమ్‌టైమ్ కేసీఆర్ సభకు వస్తే.. కృష్ణా జలాల ఎపిసోడ్‌కు కూడా అక్కడే ఫుల్ స్టాప్ పెట్టాలనేది రేవంత్ స్కెచ్‌అట. సభలు పెట్టి కేసీఆర్ ప్రజల్లోకి వెళ్లే కంటే ముందే అసెంబ్లీకి రావాలంటూ సవాల్ చేస్తూ రేవంత్ కొత్త ఎత్తుగడ వేశారన్న చర్చ

మిగతా 4వ పేజీలో



## డిసెంబర్ 31 న అర్ధరాత్రి వరకు
# లిక్కర్ అమ్మకాలు..

### బార్లు, క్లబ్బులు , టూరిజం ప్రాంతాల్లోని హోటళ్లు రాత్రి ఒంటి గంట వరకు..


### మరోవైపు న్యూ ఇయర్ వేళ పోలీస్ శాఖ నిఘా.

**దశ, హైదరాబాద్:**

న్యూ ఇయర్ వేళ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మద్యం విక్రయదారులు, వినియోగదారులకు ఊరటనిచ్చేలా.... డిసెంబర్ 31వ తేదీన మద్యం విక్రయాల వేళలను పొడిగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక జీవోను జారీ చేసింది.ఎక్సైజ్ శాఖ ఉత్తర్వుల ప్రకారం.... రాష్ట్రంలోని అన్ని వైన్ షాపులు డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి 12:00 గంటల వరకు తెరిచి ఉంటాయి. ఇక బార్లు, క్లబ్బులు , టూరిజం ప్రాంతాల్లోని హోటళ్లు, అలాగే ప్రత్యేకంగా అనుమతి పొందిన ఈవెంట్ నిర్వాహకులకు రాత్రి ఒంటి

మిగతా 4 లో

## క్యాట్ లో నాన్ ఇంజనీరింగ్ విద్యార్థులే టాప్.




- క్యాట్ ఫలితాల్లో 12 మంది 100 పర్సంటైల్ స్కోర్

4లో

## ఎల్‌బీ నగర్‌లో అటల్ జీ విగ్రహ ఆవిష్కరణ

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు.



4లో

## మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా హైదరాబాద్

- పాలనాపరమైన సంస్కరణలకు ప్రభుత్వం అడుగులు.
- పాలన అవువుకు జోన్లు, సర్కిళ్ల సంఖ్య పెరిగే అవకాశం.




4లో



# దేవస్థానంలో దొంగలు హల్చల్

❖ 2 కిలోల వెండి అపహరణ

**దశ, వెల్గటూర్:** గ్రామాలలో, దేవాలయాలలో, ఇళ్లలో ఎక్కడా తేడా లేకుండా ఈ మధ్య దొంగలు హల్చల్ చేస్తున్నారు. తాజాగా ఓ దేవస్థానంలో దొంగతనం జరిగి 2 కిలోల వెండి ఆభరణాలు అపహరించిన ఘటన ధర్మపురి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మపురి శివారులోని కమలాపూర్ రోడ్డుకు ఉన్న శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 24 వ తేదీన అర్ధరాత్రి దొంగతనం జరిగింది. దేవస్థానంలో స్వామి వారికి అలకరించిన 2 కిలోల వెండి పానపట్ట, అమ్మవారికి అలకరించిన 8 గ్రామాలు వెండి ముఖ కవచము గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. దీనిపై ఫింగర్ ప్రింట్స్ టీం ఆధారాలను సేకరించగా, దొంగతనం జరిగిన ప్రదేశాన్ని జిల్లా డి ఎస్పీ రఘు చందర్, ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి లు పరిశీలించారు.

# మనుస్మృతే సామాజిక అసమానతలకు మూలం..



❖ సామాజిక ప్రజాసంఘాల నేతలు...

**దశ నల్లగొండ:** భారతదేశంలో సామాజిక అసమానతలు, వివక్షలకు మూలకారణం మనుస్మృతేనని సామాజిక ప్రజాసంఘాల నేతలు ఆరోపించారు. మనువాదం అశాస్త్రీయమైనదని, రాజ్యాంగ విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, సంఘపరివార్ శక్తుల వల్ల దేశానికి ప్రమాదం ఏర్పడుతోందని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే ప్రజల ముందున్న ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 1927 డిసెంబర్ 25న మహారాష్ట్రలో మనుధర్మశాస్త్రాన్ని దగ్ధం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సామాజిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మనుస్మృతి ప్రతులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమాన్ని కెవిపిఎస్, తెలంగాణ విద్యావంతుల వేదిక, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం, ప్రగతిశీల యువజన సంఘం, మాల మహానాడు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం (టిపివైఎస్) జిల్లా అధ్యక్షుడు మానుపాటి బిక్షం, ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరి సాగర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గోలి సైదులు, గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న, మాలల ఐక్యవేదిక జిల్లా నాయకుడు అద్దంకి రవీందర్, మాల మహానాడు జాతీయ కార్యదర్శి తెలగమల యాదగిరి, కెవిపిఎస్ పట్టణ, మండల నాయకులు, సీఐటీయూ, డీవైఎఫ్ఐ నేతలు తదితరులు పాల్గొన్నారు.



## మొక్కు చెల్లించుకున్న బీఆర్ఎస్ నాయకులు

**దశ, మునగాల:** సూర్యపేట జిల్లా, మునగాల మండల పరిధిలోని మాధవరం గ్రామంలో గత గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల సందర్భంగా గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఆరే సురేందర్ రెడ్డి గెలుపొందితే గ్రామంలోని దేవాలయంలో 101 కొబ్బరికాయలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు కాపర్తి మాణికంఠ కుమార్ మొక్కుకున్నారు. తదనంతరం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భారాస అభ్యర్థి ఆరె సురేందర్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడంతో గురువారం గ్రామ సర్పంచ్ ఆరే సురేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మణికంఠ కుమార్ దేవాలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించి 101 కొబ్బరికాయలు కొట్టి తన మొక్కు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆరె చంద్రశేఖర్ రెడ్డి, ఆరే రామకృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

## ఎస్‌జీఎఫ్ ఉమెన్స్ గిల్డ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు




**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్(ఎస్ జీ ఎఫ్)ఉమెన్స్ గిల్డ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని అంగన్వాడి కేంద్రంలో క్రిస్మస్ కేక్ ను కట్ చేసి వేడుకలను నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు తల్లులకు అల్పాహారాన్ని కేకును చాక్లెట్స్ బిస్కెట్స్ అరటి పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవిపల్లి సర్పంచ్ తాటి అనిత, మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ రమాదేవి, ఎస్ జి ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోగాని శ్రీనివాస్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వార్డు మెంబర్ చుంచు శ్రావణి, కళ్యాణ్, శ్రీ దేవి, శ్రావణి, ఉమెన్స్ గిల్డ్ ప్రతినిధులు జ్యోతి రాణి, అంజలి, కళ్యాణి, అంగన్వాడి టీచర్లు పుష్ప, చిన్నాదేవి, ఎస్ జీ ఎఫ్ మెంబర్ సీ హెచ్.శ్రీనివాసరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జీవాలకు నట్టల నివారణ మందులు పంపిణీ



**దశ, రాజన్న సిరిసిల్ల జిల్లా:** మేకలు, గొర్రెలకు ఉచిత నట్టాల నివారణ మందులు పంపిణీ కార్యక్రమాన్ని పశువుల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని గంభీరావుపేట మండల పశు వైద్యాధికారి రామానుజాదాస్ కోరారు. గంభీరావుపేట మండలం ముస్తఫానగర్,దమ్మన్నపేట గ్రామాలలో గురువారం ఆయా గ్రామాల సర్పంచ్ లు ప్రజాప్రతినిధులతో కలిసి గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని చేశారు. ఆయా గ్రామాలకి చెందిన గొర్రెల,మేకల పెంపకందారులు జీవాలకు ఉచితంగా నట్టల నివారణ మందులను వేశారు. ఈ కార్యక్రమంలో ముస్తఫానగర్ సర్పంచ్ బండ సుకన్యదేవయ్య, గంభీరావుపేట యాదవ సంఘం మండల అధ్యక్షులు దోమకొండ కృష్ణ కాంత్ యాదవ్,ఉప సర్పంచ్ శివంది దేవయ్య, కంటే స్వామి, శ్రీశేలం,రాజు,మల్లయ్య, గొర్రెల మేకల కాపారులు,పశు వైద్య సిబ్బంది భానుచందర్,పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్లపేట నూతన సర్పంచ్, ఉపసర్పంచ్ పాలక వర్గానికి సన్మానం



**దశ, ఎల్లారెడ్డిపేట :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట ఎంప్లాయీస్ అసోసియేషన్ కు చెందిన ఉపాధ్యాయులు కోరుట్లపేట నూతన సర్పంచ్ మేడిపల్లి జ్యోతి దేవానందం,ఉప సర్పంచ్ గూడ నారాయణ రెడ్డి, వార్డు సభ్యులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వర్గాల కుల పెద్దలు కలసి కట్టుగా ఉండి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని అన్నారు.

## గాంధీభవన్‌లో క్రిస్మస్ వేడుకలు



**దశ, హైదరాబాద్:** గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలను పరస్పరం పంచుకున్నారు. క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ గుండ్లపల్లి సత్యనారాయణ , తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ ప్రీతం , మహిళా కాంగ్రెస్ అబ్జర్వర్ ఎస్తేర్ రాణి , వైబ్ గ్రూప్ చైర్మెన్ శ్రీధర్ యాలల తో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువతకు జాబ్ గ్యారెంటీతో ఉచిత స్కిల్ ట్రైనింగ్

❖ జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఎల్ ఎస్ సి లాజిస్టిక్ స్కిల్ కౌన్సిల్ రీడింగ్టన్ ఫౌండేషన్ సహకారంతో జాబ్ గ్యారెంటీతో కూడిన ఉచిత స్కిల్ ట్రైనింగ్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా లాజిస్టిక్స్ రంగానికి చెందిన వివిధ విభాగాల్లో నైపుణ్య శిక్షణ అందించి శిక్షణ పూర్తయిన అనంతరం 100 శాతం ప్లేస్‌మెంట్‌తో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఈనెల 24వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఎంపిక డ్రైవ్‌లో 29 మంది అభ్యర్థులను ఎంపిక చేయగా మొత్తం 51 మంది యువతి యువకులు శిక్షణకు హాజరయ్యారని తెలిపారు. మరింత మందికి అవకాశం కల్పించేందుకు ఈనెల 27వ తేదీన ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మరో ప్రత్యేక ఎంపిక డ్రైవ్ నిర్వహించి అదనంగా 50 మంది యువతను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో వేర్‌హౌస్ స్టోర్ కీపర్, సప్లై చైన్ అసోసియేట్, ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ ఎగ్జిక్యూటివ్ వంటి కోర్సులు ఉండగా, 10వ తరగతి నుంచి గ్రాడ్యుయేషన్ అర్హత కలిగి 18 నుంచి 27 సంవత్సరాల వయస్సు ఉన్న యువతి, యువకులు అర్హులని తెలిపారు. శిక్షణ అనంతరం నెలకు 13,000 నుంచి 18,000 వరకు జీతంతో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ పూర్తిగా ఉచితమై స్కిల్ ఇండియా సర్టిఫికేషన్ కలిగి ఉండటంతో పాటు భోజనం, వసతి సౌకర్యాలు కూడా ఉంటాయని జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

## ఈనెల 27న మహబూబాబాద్‌కు జిల్లా కేంద్రానికి కేటీఆర్ రాక

❖ గెలుపొందిన బిఆర్ఎస్ సర్పంచులకు ఆత్మీయ అభినందన సన్మాన సభ

❖ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన మాజీ ఎంపీ,జిల్లా బి ఆర్ఎస్ అధ్యక్షురాలు మాలోత్ కవిత



**దశ, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి ఈనెల 27న భారత రాష్ట్ర సమితి బి ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు రానున్నారని బి ఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు,మాజీ ఎంపీ మాలోత్ కవిత మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో బి ఆర్ఎస్ పార్టీ తరపున గెలుపొందిన సర్పంచులు, ఉపసర్పంచులకు ఆత్మీయ అభినందన సన్మాన సభను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని పిఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 27 ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరగనుందనీ అన్నారు,ఈ సందర్భంగా కవిత మాలోత్ మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ బి ఆర్ఎస్ పార్టీని బలోపేతం చేస్తూ ఢీ అంటే ఢీ స్థాయిలో పోరాటపటిమతో గెలుపొందిన సర్పంచులను స్వయంగా కలసి అభినందించి, వారికి భరోసా కల్పించాలనే ఉద్దేశంతో కేటీఆర్ మహబూబాబాద్‌కు వస్తున్నారని తెలిపారుమహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా బి ఆర్ఎస్ పార్టీ మద్దతుతో గెలుపొందిన సర్పంచులు, ఉప సర్పంచులు అందరూ తప్పక ఈ సభకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇదే ప్రత్యేక ఆహ్వానంగా భావించి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, డిఎస్ రెడ్యానాయక్, ఎమ్మెల్సీ, తక్కళ్ళపల్లి రవీందర్ రావు, జిల్లా సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**దశ, హైదరాబాద్:** అంతర్జాతీయ సేవా సంస్థ బ్లిస్‌బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ఫ హోప్ ఆధ్వర్యంలో కార్పొరేట్ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెనిసిస్ ఇన్ఫో ఎక్స్ వినయ్ సరికొండ, ప్రొఫెసర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత

"ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రిస్టియన్ సమాజానికి తెలంగాణ ప్రభుత్వమిచ్చిన మద్దతు"



**దశ, ఓయూ:** గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి , టీ టీ యు సి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మోతే శోభన్ రెడ్డి తో కలిసి క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని తార్నాక, లాలపెట్లో లోగోస్ గాస్పల్ చర్చ్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి ప్రార్థనలో పాల్గొని, క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రిస్టియన్ సోదరులు, సోదరీమణులందరికీ "మేరీ క్రిస్మస్" శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ, క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, సహనానికి ప్రతీకగా నిలుస్తుందని, మనుషుల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే ఈ వేడుకలను అందరూ ఉత్సాహంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు మరియు తెలంగాణ ప్రభుత్వం క్రిస్టియన్ సమాజానికి అనేక ఉపయోగకరమైన కార్యక్రమాలను చేపట్టిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రిస్టియన్ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడం, పండుగల సందర్భంగా ప్రత్యేక నిధులు విడుదల చేయడం, పేద క్రిస్టియన్ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం వంటి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలులో ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ క్రిస్టియన్ సమాజ అభ్యున్నతికి కట్టుబడి ఉందని డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, క్రిస్టియన్ సంఘం ప్రతినిధులు, విశ్వాసులు పాల్గొన్నారు.

జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..

03
శుక్రవారం
26-12-2025
WWW.
DASHANEWS
.COM



# వేములవాడలో పిచ్చికుక్క దాడి

*20 మందికి పైగా భక్తులకు గాయాలు; వీధికుక్కలను పట్టించుకోని అధికారులు*

**దశ, రాజన్న సిరిసిల్ల:** వేములవాడ రాజన్న ఆలయం వద్ద ఓ పిచ్చికుక్క రెచ్చిపోయింది. ఆలయానికి వచ్చిన భక్తులపై కుక్క దాడి చేయగా..దాదాపు 20 మందికి పైగా భక్తులు ఈ దాడిలో గాయపడ్డారు. దీంతో గాయపడిన వారిని వెంటనే సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. కాగా, ఆలయం వద్ద పిచ్చి కుక్క దాడితో భక్తులు తీవ్ర భయాందోళనకు గురవడంతో పాటు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిచ్చి కుక్క ఇలా ఇష్టం వచ్చినట్లు దాడి చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారంటూ మండిపడ్డారు. వీధి కుక్కల బెడదపై మున్సిపల్ అధికారులకు ముందే ఫిర్యాదు చేసినప్పటికీ, వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ యంత్రాంగం సకాలంలో స్పందించి ఉంటే ఇంతమంది గాయపడేవారు కాదు అని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆలయం వద్ద ఉన్న పిచ్చి కుక్కను పట్టుకోవాలని భక్తులు కోరుతున్నారు. ఈ ఘటనతో పవిత్ర పుణ్యక్షేత్రంలో భక్తుల భద్రతను గాలికొదిలేశారనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి.

# యేసు ప్రవచనాలతో ప్రపంచ శాంతి

❖ *ద్వేషాన్ని విడిచి శాంతిని పంచాలి, అదే క్రిస్మస్ పండుగ సందేశం: మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి*



**దశ, కోదాడ:** యేసు క్రీస్తు ప్రవచనాలతో ప్రపంచ శాంతి వర్ధిల్లుతుందని, ఆయన గొప్ప సంఘ సంస్కర్త అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని కోదాడ పట్టణంలోని సెయింట్ జోసెఫ్ సిసిఆర్ విద్యా నిలయంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ కేవలం పండుగ మాత్రమే కాదని, ఇది ప్రేమ, శాంతి, ఐకమత్యాన్ని మనకు గుర్తుచేసే రోజన్నారు. ప్రేమతో జీవిస్తూ ఇతరులకు సహాయం చేస్తూ ముందుకు సాగాలని యేసు బోధించారన్నారు. దయ, వినయం, సేవాభావం మన జీవితాల్లో కనిపించాలని సూచించారు.

ద్వేషాన్ని విడిచిపెట్టి శాంతిని పంచాలని, అవసరంలో ఉన్నవారిని ఆదుకోవడం, బాధలో ఉన్నవారిని ఓదార్చడం నిజమైన క్రిస్మస్ సందేశమన్నారు. ఈ క్రిస్మస్ పండుగ మన హృదయాల్లో కొత్త వెలుగును నింపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు, పీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మాజీ డీసీసీబీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నంబాబు, సుపీరియర్ సిస్టర్ నక్షత్రం, ప్రధానోపాధ్యాయులు జ్యోతి పాల్గొన్నారు.

### శాంతి, సహనానికి ప్రతీక: కొండా సురేఖ

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధిలోని దేశాయిపేట, మండి బజార్, లేబర్ కాలనీ, క్రిస్టియన్ కాలనీ, ఖిలా వరంగల్, నాగమయ్య గుడి ప్రాంతాల్లో గల చర్చిలలో గురువారం రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, సహనానికి ప్రతీక అని, అన్ని మతాల పండుగలను గౌరవించడం తెలంగాణ సంస్కృతికి నిదర్శనమని అన్నారు. ప్రజలంతా ఐక్యతతో, పరస్పర గౌరవంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.







# ఘనంగా క్రిస్మస్ సెలెబ్రేషన్స్










# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**దశ,యాదగిరిగుట్ట:** క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఆత్మకూరు మండల కేంద్రంలోని చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకు ముందు క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని యాదగిరిగుట్ట పట్టణం యాదగిరిపల్లి లో ఉన్న చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఆలేరు నియోజకవర్గంలో క్రిస్మస్ వేడుకలను ఆనందంగా జరుపుకుంటున్నారని. ఏసు ప్రభువు బోధనల స్ఫూర్తితో పని చేస్తున్న ప్రజా ప్రభుత్వం అన్ని మతాల సంక్షేమం, అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.

# శ్రేయాస్ అయ్యర్ వచ్చేస్తున్నాడు!



భారత జట్టు ఫ్యాన్స్ కు గుడ్ న్యూస్. స్టార్ ఆటగాడు శ్రేయాస్ అయ్యర్ త్వరలోనే గ్రౌండ్ లో అడుగుపెట్టి ఎప్పటిలాగే బ్యాటింగ్ చేయనున్నాడు. ప్రస్తుతం విజయ్ హజారే టోర్నమెంట్ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ టోర్నమెంటు చివరి దశలో శ్రేయాస్ అయ్యర్ రంగంలోకి దిగబోతున్నాడు. ఈ మేరకు నేషనల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఒకవేళ విజయ్ హజారే టోర్నమెంట్ చివరి దశలో శ్రేయాస్ అయ్యర్ ఎంట్రీ ఇస్తే, జనవరిలో భారత్ వర్సెస్ న్యూజిలాండ్ మధ్య జరిగే వన్డే సిరీస్ కు కూడా అందుబాటులోకి వస్తాడని తెలుస్తోంది. ఇదే జరిగితే, భారత జట్టుకు చాలా ప్లస్ అవుతుంది. ఇది ఇలా ఉండగా భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య వన్డే సిరీస్ జరిగిన నేపథ్యంలో శ్రేయాస్ అయ్యర్ గాయపడ్డాడు. దీంతో అప్పటి నుంచి అతడు జట్టుకు దూరమయ్యాడు. అయితే ఇప్పుడు శ్రేయాస్ అయ్యర్ రీ ఎంట్రీ చేస్తాడని అంటున్నారు. ప్రస్తుతం అతను నొప్పి లేకుండా ఉన్నాడు. బుధవారం ముంబయిలో ఎలాంటి ఇబ్బందీ లేకుండా బ్యాటింగ్ చేశాడు. రెగ్యులర్‌గా జిమ్‌లో కసరత్తులు చేస్తున్నాడు. నాలుగైదు రోజుల పాటు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గడుపుతాడు. అక్కడ అయ్యర్ ఫిట్‌నెస్‌ను మెడికల్, స్పోర్ట్స్ సైన్స్ స్టాఫ్ అంచనా వేస్తుంది' అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. జనవరి 11 నుంచి భారత్, న్యూజిలాండ్ మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ కోసం జనవరి 2 లేదా 3న జట్టును ప్రకటించనున్నట్లు సమాచారం. CoE నుంచి క్లియరెన్స్ వస్తే అయ్యర్‌ను జట్టులోకి తీసుకునే అవకాశముంది.


# నేటి నుంచి ఎస్ఏ20 నాలుగో సీజన్




ప్రపంచమంతా విస్తరించిన ఫ్రాంచైజీ క్రికెట్ లీగ్ సందడి దక్షిణాఫ్రికాలోనూ మొదలవ్వనుంది. మూడు సీజన్లుగా అభిమానులను అరలిస్తున్న ఎస్ఏ20 నాలుగో ఎడిషన్ నేటి నుంచి షురూ కానుంది. ఐపీఎల్, బిగ్‌బాష్ లీగ్ తరహాలో క్రేజ్ సంపాదించుకున్న ఎస్ఏ20లో టైటిల్ కోసం ఆరు జట్లు పోటీపడనున్నాయి. దాదాపు నెలరోజులు ఉత్కంఠ పోరాటాలతో కొనసాగే ఈ టోర్నీలో విజేత ఎవరో జనవరి 25న జరిగే ఫైనల్‌తో తేలిపోనుంది. టీ20ల్లోని మజాను అభిమానులకు పంచేందుకు ఎస్ఏ20 సిద్ధమవుతోంది. అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాలుగో సీజన్ నేటి నుంచే ప్రారంభమవుతుంది. తొలి పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ ఎంఐ కేప్‌టౌన్‌తో డర్బన్ సూపర్ జెయింట్స్ తలపడనుంది. డబుల్ రౌండ్ రాబిన్ పద్ధతిలో నాలుగు వారాల పాటు సందడిగా సాగే ఈ టోర్నీలో టాప్ 4 జట్లు ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్తాయి. జనవరి 25న ఫైనల్‌తో ఈ లీగ్ ముగుస్తుంది. టోర్నీ ఆరంభానికి మరికొన్ని గంటలే ఉన్నందున గురువారం లీగ్ కమిషనర్ గ్రేమ్ స్మిత్, జేపీ డుమినీ, డూప్లెసిస్, షాన్ పొలాక్, హషీం ఆమ్లాలు ట్రోఫీని ఆవిష్కరించారు.

## సినిమా దశ

# రాజా సాబ్ నుంచి మ్యూజికల్ సర్‌ప్రైజ్



ప్రభాస్ హీరోగా, దర్శకుడు మారుతి కాంబినేషన్‌లో వస్తున్న భారీ చిత్రం ది రాజా సాబ్. క్రిస్మస్ సందర్భంగా ఈ సినిమా నుంచి చిత్ర యూనిట్ అభిమానులకు అదిరిపోయే మ్యూజికల్ సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఈ సందర్భంగా రాజే యువరాజే అనే సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. ఈ ప్రోమోలో హీరోయిన్ నిధి అగర్వాల్ చెప్పే నీది ప్రేమ.. ప్రేయర్ చేస్తా కళ్లు మూసుకో అనే డైలాగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కుతుండటంతో, ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి. విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమాలో నిధి అగర్వాల్‌తో పాటు మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 9న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కావడానికి సిద్ధంగా ఉంది. ప్రభాస్‌ను సరికొత్త వింటేజ్ లుక్‌లో చూసేందుకు ఫ్యాన్స్ ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. తాజా క్రిస్మస్ వీడియో నెట్టింట వైరల్‌గా మారడంతో, సంక్రాంతి రేసులో రాజా సాబ్ సందడి ఖాయమని అర్థమవుతోంది.

# జాజికాయ ఫుల్ వీడియో సాంగ్ రిలీజ్




బాలకృష్ణ ,బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వచ్చిన అఖండ 2: తాండవం ఫ్యాన్స్‌ను బాగా ఆకట్టుకుంది. ఈ సినిమాకు సంబంధించిన లేటెస్ట్ మాస్ సాంగ్ జాజికాయ ఫుల్ వీడియో సాంగ్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ పాటలో బాలయ్య ఎనర్జిటిక్ స్టెప్పులతో అదరగొట్టగా, ఆయనతో పాటు హీరోయిన్ సంయుక్త మీనన్ కూడా ఆకట్టుకున్నారు. తమన్ అందించిన ఊర మాస్ బీట్‌కు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. ఇప్పటికే ఈ సినిమాలోని తాండవం సాంగ్, అఘోర పాత్రలోని గ్లింప్స్ భారీ హైప్ క్రియేట్ చేయగా, ఇప్పుడు వచ్చిన ఈ మాస్ సాంగ్ కూడా యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలి చింది.డిసెంబర్ 12న విడుదలైన ఈ చిత్రం సనాతన ధర్మం మరియు ఆధ్యాత్మిక అంశాల నేపథ్యంలో సాగుతూ ప్రేక్షకులను అలరించింది.

## డ్రంకన్ డ్రైవ్ లో పాల్గొన్న సీపీ సజ్జనర్.



**దశ, హైదరాబాద్:**బంజారాహిల్స్లోని టీజీ స్టడీ సర్కిల్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను బుధవారం అర్ధరాత్రి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. తనిఖీలు జరుగుతున్న విధానాన్ని, సిబ్బంది పనితీరును పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. డ్రంకెన్ డ్రైవ్లో పట్టుబడిన వారితో మాట్లాడి.. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించారు. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు సీపీ తెలిపారు. డిసెంబరు 31 రాత్రి వరకు నగరవ్యాప్తంగా 'స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ డ్రైవ్' నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏడు ప్లాటూన్ల అదనపు బలగాలతో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని 120 ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడిపితే ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తనిఖీల్లో పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు రూ.10 వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. తీవ్రతను బట్టి డ్రైవింగ్ లైసెన్సు శాశ్వతంగా రద్దు చేసేలా రవాణా శాఖకు సిఫార్సు చేస్తామన్నారు.



## ఎల్బీ నగర్లో అటల్ జీ విగ్రహా ఆవిష్కరణ

**బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు.**

**దశ, హైదరాబాద్:** మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారీ వాజ్పేయి జయంతిని పురస్కరించుకొని 'అటల్ స్మృతి వర్ష్' సందర్భంగా, ఎల్బీ నగర్లో అటల్ జీ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ ఈ కార్యక్రమానికి త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి , బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు , పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ , తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూదేశానికి అటల్ జీ అందించిన అపూర్వ సేవలు, ఆయన దూరదృష్టిగల నాయకత్వం, సుస్థిర పరిపాలనతో పాటు ప్రజాస్వామ్య విలువల పట్ల ఆయన నెలకొల్పిన చిరస్థాయి వారసత్వం తరతరాలుగా దేశ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయన్నారు.. అటల్ బిహారీ వాజ్పేయి జీ జయంతిని పురస్కరించుకొని, అటల్ స్మృతి వర్ష్ సందర్భంగా ఎల్బీ నగర్లో అటల్ జీ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉంది.ఈ విగ్రహా ఆవిష్కరణకు సహకరించిన విగ్రహదాతలకు, కమిటీలో ఉన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను

## డిసెంబర్ 31 న అర్ధరాత్రి వరకు లిక్కర్ అమ్మకాలు..

**మొదటి పేజీ తరువాయి**

గంట వరకు పని చేయడానికి అనుమతి ఉంటుంది.మరోవైపు న్యూ ఇయర్ వేళ హద్దుదాటి ప్రవర్తించే వారిపై పోలీస్ శాఖ నిఘా పెట్టనుంది. డిసెంబర్ 27వ తేదీ నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ కూడా ప్రత్యేక తనిఖీలు , డ్రైవ్స్ చేపట్టనుంది. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుండి అక్రమంగా వచ్చే మద్యం , నిషేధిత మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా ఎక్కడిక్కడ సోదాలు చేపట్టనుంది. ముఖ్యంగా డిసెంబర్ 30 , 31 తేదీలలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది. సిటీలోనే కాకుండా... చెక్ పోస్టుల వద్ద కూడా నిఘా పెంచనుంది.ఇక నూతన సంవత్సర వేడుకల పేరుతో రోడ్లపై హంగామా సృష్టిస్తూ, హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ పోలీసులు హెచ్చరించారు. తాగి వాహనాలు నడిపే వారిపై బుధవారం నుంచి న్యూ ఇయర్ రోజు వరకు నగరవ్యాప్తంగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు నగర సీపీ సజ్జనార్ వివరాలను వెల్లడించారుక్రిస్మస్, వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. హాట్ స్పాట్లు, గతంలో నేరాలు జరిగిన ప్రాంతాల్లో సిబ్బందిని మోహరించాలని, పాత నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు.డిసెంబరు 31 రాత్రి నగరవ్యాప్తంగా 100 ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని సీపీ తెలిపారు. ఇందుకోసం 7 ప్లాటూన్ల అదనపు బలగాలను రంగంలోకి దించుతున్నామన్నారు. కొత్త సంవత్సరం జోష్లో మోతాదు మించి తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడితే వాహన సీజ్తో పాటు రూ.10 వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

## క్యాట్లో నాన్ ఇంజనీరింగ్ విద్యార్థులే టాప్




**దశ, హైదరాబాద్:**దేశ వ్యాప్తంగా ఉన్న ప్రతిష్ఠాత్మక ఐఐఎంలు, మేనేజ్మెంట్ సంస్థల్లో ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన కామన్ అడ్మిషన్ టెస్టు (క్యాట్) 2025 ప్రవేశ పరీక్ష ఫలితాలు తాజాగా విడుదలయ్యాయి. క్యాట్ ఫలితాల్లో మొత్తం 12 మంది 100 పర్సంటైల్ స్కోర్ సాధించారు. అయితే ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి ఒక్కరు కూడా వంద శాతం స్కోర్ సాధించ లేకపోవడం గమనార్హం. గత ఏడాది 100 పర్సంటైల్ స్కోర్ పొందిన 14 మందిలో తెలంగాణ విద్యార్థులు ఇద్దరు, ఏపీ అభ్యర్థి ఒకరు చోటు దక్కించుకున్నారు. 100 పర్సంటైల్ సాధించిన 12 మందిలో ఇద్దరు అమ్మాయిలున్నారు. అలాగే ఈ 12 మందిలో ఏకంగా 9 మంది ఇంజనీరింగ్ బ్యాక్గ్రౌండ్ లేనివారే కావడం విశేషం. టాపర్లలో ముగ్గురు మాత్రమే ఇంజనీరింగ్ అభ్యర్థులు ఉన్నారు. గతానికి భిన్నంగా ఈసారి నాన్ ఇంజనీరింగ్ అభ్యర్థులు ఎక్కువ మంది టాపర్లుగా నిలవడం విశేషం. ఆ తర్వాత ర్యాంకుల్లో అంటే 99.99 పర్సంటైల్ సాధించిన వారు 26 మంది ఉన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక్కరు మాత్రమే ర్యాంకు సాధించారు.కాగా ఈ ఏడాది నవంబరు 30వ తేదీన క్యాట్ 2025 పరీక్ష దేశ వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన సంగతి తెలిసిదే. ఈ పరీక్ష ఫలితాలను ఐఐఎం కోజికోడ్ తాజాగా విడుదల చేసింది. మొత్తం 2.95 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా.. ఇందులో 2.58 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 97 వేల మంది అమ్మాయిలు, 1.61 లక్షల మంది అబ్బాయిలు ఉన్నారు. టాపర్ల పేర్లను త్వరలోనే వెల్లడించనున్నారు. క్యాట్ స్కోర్ ఆధారంగా ఆయా ఐఐఎంలు ఇంటర్వ్యూ నిర్వహించి సీట్లు కేటాయిస్తాయి. 96 ఆపై పర్సంటైల్ వచ్చిన వారికి ఓపెన్ కేటగిరీలో అంటే రిజర్వేషన్ లేకున్నా ఐఐఎంల్లో సీటు కేటాయించనున్నారు. రిజర్వేషన్ ఉన్న వారికి 90కిపైగా పర్సంటైల్ దక్కినవారికే సీట్లు కేటాయించనున్నారు. మొత్తం 22 ఐఐఎంలతోపాటు దేశ వ్యాప్తంగా 93 ఇతర విద్యా సంస్థలు క్యాట్ స్కోర్ ఆధారంగా సీట్లను కేటాయిస్తాయి

# ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక మలుపు



**దశ, హైదరాబాద్:**

తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు అనూహ్య మలుపు తిరిగింది. ఇన్నాళ్లూ విచారణ, అరెస్టుల చుట్టూ తిరిగిన ఈ కేసు దర్యాప్తు ఇప్పుడు ఒక పెన్డ్రైవ్ కేంద్రంగా మారింది. అందులో నిక్షిప్తమైన సమాచారం బీఆర్ఎస్ అగ్రనాయకత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు వద్ద లభించిన ఈ పెన్డ్రైవ్లో ట్యాపింగ్కు సంబంధించిన పక్కా ఆధారాలు ఉన్నాయని సిట్ భావిస్తోంది. ఈ సాక్ష్యాల ఆధారంగానే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులకు నోటీసులు జారీ చేసేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు విస్తృత ట్యాప్ చేసిన ఫోన్ నంబర్లు, వారి వ్యక్తిగత సమాచారం ఇందులోనిక్షిప్తమై ఉందిప్రస్తుతం సిట్ కస్టడీలో ఉన్న మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావును ఈ పెన్డ్రైవ్ ఆధారంగానే అధికారులు ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. ఎల్లుండి వరకు ఆయన్ను విచారించనున్న నేపథ్యంలో.. ఈ పెన్డ్రైవ్లోని డేటాను ఎవరి ఆదేశాల మేరకు సేకరించారు.? ఎవరికి చేరవేశారు.? అన్న కోణంలో లోతుగా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను , మరో మాజీ ఎస్ఐబీ చీఫ్ను విచారించిన సిట్.. ఇప్పుడు ప్రభాకర్ రావు ఇచ్చే సమాచారంతో కేసుకు ముగింపు పలికే దిశగా వెళ్తోంది.అసలు ఈ ట్యాపింగ్ పర్వం ఎవరి ప్రయోజనాల కోసం జరిగింది.? అన్నదే ఇప్పుడు సిట్ ముందున్న ప్రధాన ప్రశ్న. ప్రభుత్వంలోని పెద్దల ఆదేశాలు లేనిదే ఇంతటి భారీ నిఘా యంత్రాంగం నడవడం అసాధ్యమని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుల పాత్రపై అనుమానాలు బలపడుతున్నాయి. పెన్డ్రైవ్లో ఉన్న సమాచారం కను క నేరుగా రాజకీయ పెద్దలకు లింక్ అయితే, వారికి నోటీసులు ఇవ్వడం ఖాయమని పోలీసు వర్గాల టాక్. ఈ పెన్ డ్రైవ్ వ్యవహారం బయటకు రావడంతో.. అందులో ఎవరెవరి పేర్లు ఉ న్నాయన్నది ఇప్పుడు రాజకీయ, మీడి యా, న్యాయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ట్యాపింగ్ కేసులో ఇన్నాళ్లూ దొరకని కీలక లింక్ ఈ పెన్ డ్రైవ్ రూపంలో దొరికిందని, ఇదే ఈ కేసులో గేమ్ ఛేంజర్ కాబోతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలోనే ఈ కేసులో మరిన్ని సంచలన అరెస్టులు లేదా నోటీసులు వెలువడే అవకాశం ఉంది.

## నల్లగొండ బీజేపీలో భగ్గుమన్న విభేదాలు..




**మొదటి పేజీ తరువాయి**

చివరకు బాహాబాహీకి దారితీశాయి. క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకునే పార్టీ కార్యాలయంలోనే నేతలు ఇలా కొట్టుకోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో నాగం వర్షిత్ రెడ్డి అనుచరుడు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అయిన పకీరు మోహన్ రెడ్డి ఒక్కసారిగా మీదికి వచ్చి పిల్లి రామరాజు యాదవ్ పై పిడి గుద్దులు గుద్దాడు. పక్కనే ఉన్న నాగం వర్షిత్ రెడ్డి ఈ దాడిని అడ్డుకునే ప్రయత్నం చేయకపోగా మోహన్ రెడ్డికి మద్దతు పలికాడని రామరాజు యాదవ్ ఆరోపిస్తున్నారు. మరోవైపు అక్కడే ఉన్న ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి ఈ గొడవను రికార్డు చేయగా నాగం వర్షిత్ రెడ్డి మీడియా ప్రతినిధి పై బల ప్రయోగం చేసి కెమెరాను గుంజుకొని చిప్ను ఫార్మాట్ చేశాడు.దీంతో మరోవైపు జర్నలిస్టులు తమపై జరిగిన దాడిని నిరసిస్తూ కార్యాలయం ఎదుట జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. మొత్తం ఈ వివాదానికి సంబంధించి న వివరాలు ఇలా ఉన్నాయి. మాజీ ప్రధాని వాజ్ పేయి జయంతి సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఇటీవల బీజేపీ నుంచి గెలిచిన సర్పంచ్, ఉప సర్పంచ్ అభ్యర్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి అనుమతి తీసుకొని పిల్లి రామరాజు యాదవ్ అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం అర్ధరాత్రి ఫోన్ చేసి సన్మాన కార్యక్రమాన్ని రద్దు చేయాలని నాగం వర్షిత్ రెడ్డి ఆదేశించాడని పిల్లి రామరాజు యాదవ్ చెబుతున్నారు. గురువారం ఉదయం పార్టీ కార్యాలయంలో వాజ్ పేయి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న సమయంలో నాగం వర్షిత్ రెడ్డి సర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పాడని పిల్లి రామరాజు యాదవ్ చెబుతున్నారు. తనను సన్మాన కార్యక్రమం నిర్వహించవద్దని చెప్పి ఇప్పుడు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించడంతో నాగం వర్షిత్ రెడ్డి, పిల్లి రామరాజు యాదవుల మధ్య వివాదం నెలకొంది.ఈ క్రమంలో పకీరు మోహన్ రెడ్డి రామరాజు యాదవ్ పై దాడి చేశారు. తనపై జరిగిన దాడిని నిరసిస్తూ రామరాజు యాదవ్ జిల్లా పార్టీ కార్యాలయంలోతన అనుచరులతోఆందోళన చేపట్టారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసి 28 వేల ఓట్లను తెచ్చుకున్నానని, బీజేపీపై ఉన్న ప్రేమతో ఈ పార్టీలో చేరానని చెప్పారు. అయితే నాగం వర్షిత్ రెడ్డి పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టడంలో పూర్తిగా విఫలమయ్యాడని ఆయన ఆరోపించారు.



## రేవంత్ స్కెచ్లో కేసీఆర్..

**మొదటి పేజీ తరువాయి**

జరుగుతోంది. Also Read: నేనూ హీరోయిన్నే.. మీది చేతగానితనం.. నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే..: శివాజీపై అనసూయ మళ్లీ ఫైర్. కృష్ణాజలాల అంశంతో పొలిటికల్గా యాక్టీవ్ కావాలని కేసీఆర్ ప్లాన్ చేస్తున్నారు. అందుకే నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్నగర్లో సభలకు రెడీ అవుతున్నారు. ఈ మీటింగ్లకు తాను స్వయంగా హాజరవుతానని..ఇక నుంచి ఐయామ్ ఆన్ ది ఫీల్ అంటూ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగాని తనం వల్లే తెలంగాణకు న్యాయంగా రావాల్సిన నీటి వాటా దక్కడం లేదన్న వాదనను ప్రజల్లోకి తీసుకెళ్లాలనుకుంటున్నారు. అయితే ఇంతలోపే అసెంబ్లీ సమావేశాలు పెట్టి.. కేసీఆర్ సభకు రమ్మని సవాల్ చేస్తున్నారు రేవంత్. కేసీఆర్ అసెంబ్లీకి వెళ్తారా? లేదా? అసలు తెలంగాణకు నీటి వివాదాలు రావడానికి కేసీఆరే కారణమంటున్న రేవంత్.. పార్టీ ఆఫీసుల్లో కూర్చొని మాట్లాడటం కాదు.. దమ్ముంటే అసెంబ్లీకి రావాలంటూ ఛాలెంజ్ విసురుతున్నారు. అయితే కేసీఆర్ అసెంబ్లీకి వెళ్తారా లేదా అన్నది డౌటే. ఎందుకంటే ఆయన ప్రతిపక్షంలోకి వచ్చినప్పటి నుంచి ఏ చర్చలో పాల్గొన్న సందర్భాలు లేవు. తెలంగాణ భవన్లో లేకపోతే ఫాంహౌస్లో నేతలను ఉద్దేశించి మాట్లాడటమో..ప్రెస్మీట్ పెట్టడమో తప్ప..అసెంబ్లీ వేదికగా అపోజిషన్ లీడర్గా ఏ అంశాన్ని ప్రస్తావించలేదు కేసీఆర్. ఇదే అస్త్రంగా మల్చుకుని కేసీఆర్ను సభకు రప్పించేందుకు మరోసారి గేమ్ స్టార్ట్ చేశారు సీఎం రేవంత్రెడ్డి. ముఖ్యమంత్రి ముందు నుంచి పదే పదే ప్రస్తావిస్తున్న అంశం ఒకే ఒక్కటి.కేసీఆర్ అసెంబ్లీకి రావాలని.ఎన్నిసార్లు సవాల్ చేసినా..రేవంత్ మాటలను కేసీఆర్ పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించలేదు. కేటీఆర్, హరీశ్తోనే కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల ప్రశ్నలకు సమాధానం చెప్పించారు కేసీఆర్. అయితే రేవంత్ మొత్తం కేసీఆర్ లేవనెత్తిన కృష్ణా జలాల అంశంలో ఆయన చేతనే చేత సమాధానం చెప్పించాలనే ఎత్తుగడ వేస్తున్నట్లు టాక్. అసెంబ్లీ వేదికగా రేవంత్ వర్సెస్ కేసీఆర్ అన్నట్లుగా చర్చ జరగాలనేది సీఎం స్కెచ్ అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే టాపిక్ ఏదైనా చర్చకు రెడీ అంటూ రేవంత్ సవాల్ విసురుతున్నారని అంటున్నారు. అల్టిమేట్గా కేసీఆర్ను సభకు రప్పించాలన్నది రేవంత్ మైండ్ గేమ్ అన్న ఒపీనియన్స్ వ్యక్తం అవుతున్నాయి. ఒకవేళ రేవంత్ సవాల్ను స్వీకరించి కేసీఆర్ సభకు వస్తే..ముందు ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని చర్చకు పెట్టే ప్లాన్ చేస్తున్నారట. కృష్ణావాటర్ విషయంలో కేసీఆర్ కేంద్రం దగ్గర ఒప్పుకున్న అంశాలను ఎక్స్పోజ్ చేస్తూ..తెలంగాణకు నీటి వాటాలు దక్కకుండా చేశారని వివరించాలని అనుకుంటున్నారట. మరి రేవంత్ సవాల్ను స్వీకరించి కేసీఆర్ అసెంబ్లీకి వస్తారా లేక ఎప్పటిలాగే లైట్ తీసుకుంటారా అనేది వేచి చూడాలి.

# మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా హైదరాబాద్




**దశ, హైదరాబాద్:**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పాలనాపరమైన సంస్కరణలకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. డివిజన్ల పునర్విభజన ప్రక్రియ దాదాపు ముగింపు దశకు చేరుకోవడంతో.. క్షేత్రస్థాయిలో పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జోన్లు, సర్కిళ్ల సంఖ్యను భారీగా పెంచాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ నిర్ణయించారు. ఈ ప్రతిపాదిత ప్రణాళికపై రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడమే తరువాయి.. వారం రోజుల్లో కొత్త సర్కిళ్లు, జోన్ల హద్దులను ఖరారు చేస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.గతంలో 650 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న జీహెచ్ఎంసీ.. ఇటీవల 27 శివారు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల విలీనంతో ఏకంగా 2,053 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. ప్రస్తుతం ఆరు జోన్లు, 30 సర్కిళ్ల ద్వారా సాగుతున్న పరిపాలన ఇంత భారీ విస్తీర్ణానికి సరిపోవడం లేదని అధికారులు గుర్తించారు. ముఖ్యంగా ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం నుంచి పెద్దఅంబర్పేట్ వంటి సుదూర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, వీధిలైట్లు, రహదారుల పనులను పర్యవేక్షించడం జోనల్ కమిషనర్లకు సవాలుగా మారింది. ఈ సమస్యను అధిగమించడానికి ప్రస్తుతమున్న 6 జోన్లను 12కు, 30 సర్కిళ్లను 60కి పెంచాలని నిర్ణయించారు. దీనివల్ల ప్రతి జోన్ పరిధిలో సగటున ఐదు సర్కిళ్లు ఉండి, పర్యవేక్షణ మరింత సులభతరం కానుంది. వచ్చే ఏడాది జనవరి నుంచి దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ ప్రారంభం కానుంది. ఒకసారి జనగణన మొదలైతే, తదుపరి రెండేళ్ల వరకు డివిజన్ల మార్పులు లేదా పునర్విభజన చేపట్టడం సాధ్యపడదు. ఈ సాంకేతిక ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని.. ప్రభుత్వం అత్యంత వేగంగా శివారు ప్రాంతాల విలీనాన్ని పూర్తి చేసి పునర్విభజన ప్రక్రియను కొలిక్కి తెచ్చింది. ఈ వ్యవస్థీకరణ కేవలం సౌలభ్యం కోసం మాత్రమే కాకుండా.. భవిష్యత్తులో జీహెచ్ఎంసీని మూడు స్వతంత్ర మహానగరపాలక సంస్థలుగా విభజించాలనే ప్రభుత్వ దీర్ఘకాలిక వ్యూహానికి పునాదిగా కనిపిస్తోంది.ప్రభుత్వ ప్రాథమిక ఆలోచన ప్రకారం.. మూసీ నదిని సరిహద్దుగా తీసుకుని నగర విభజన జరగనుంది. మూసీకి దక్షిణాన ఉన్న ప్రాంతాలన్నింటినీ కలిపి ఒక కార్పొరేషన్గా దీనికి 'జీహెచ్ఎంసీ' పేరునే కొనసాగించే అవకాశం ఉంది. ఉత్తరాన ఉన్న ప్రాంతాలను సికింద్రాబాద్, సైబరాబాద్ పేరుతో మరో రెండు కార్పొరేషన్లుగా ఏర్పాటు చేసే దిశగా కసరత్తు సాగుతోంది. ఈ చారిత్రాత్మక మార్పు ద్వారా నగరంలోని అన్ని ప్రాంతాలకు సమానంగా నిధులు కేటాయించడం, ట్రాఫిక్, వ్యర్థాల నిర్వహణ వంటి సమస్యలను స్థానికంగానే పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం. ఈ పునర్ వ్యవస్థీకరణ పూర్తయితే.. హైదరాబాద్ మహానగరం పాలనాపరంగా సరికొత్త రూపురేఖలను సంతరించుకోనుంది.

Printed and Published by B. Kalpana on behalf of Kalpana Publications.
Printed & Published at Flat No. 101, Sri Heights Apartment, Shilpi Colony, Pasumamula Road, Pedda Amberpet, Rangareddy- 50105. Editor: B. KALPANA, RNI Reg No. TGTEL/25/A4195.